"అమ్మగారూ! టిఫిన్ చల్లారిపోతోంది తినండమ్మా" గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి టేబిల్ మీద పెట్టింది తాయారమ్మ.

"తాయారూ! అలా చూడు. ఆ సీరియల్‌లో ఆమె పడుతున్న బాధ నా బాధలకన్నా ఎక్కువా? ఆత్మహత్య చేసుకొంటోంది. నేను మాత్రం మొండిదానిలా తింటూ బతికున్నాను" నిస్పృహ, నిరాశ నిండిన గొంతుతో అంది సావిత్రి.

అదేంటమ్మా మీకెవరూ లేరనుకోకండమ్మా. నేను మీ నీడలా మీవెంటే ఉంటానమ్మగారూ".

"నాకు తెలుసు తాయారూ. నాకున్న ఒకే ఒక ఆలంబన నువ్వే. కానీ నా గతజీవితం పూర్తిగా తెలిసిన నువ్వు నన్ను మొండిదాన్లా భావించడం లేదా?"

టిఫిన్ తినేవరకూ తాయారమ్మ వదలదని అనుకుంటూ టిఫిన్ పూర్తిచేసి, ప్లేటు ఆమె చేతికిచ్చి సోఫాలో చేరబడి కళ్ళుమూసుకుంది సావిత్రి. గతం సినిమా రీలులా కళ్ళ ముందు కదిలింది.



# నెట్ జీవితం

నాన్న పెద్దకంపెనీకి మేనేజింగ్‌డైరెక్టర్. అమ్మ పి.డబ్ల్యు.డి.లో ఇంజనీరు. తనొక్కతే కూతురు. అందరి దృష్టిలో తాను చాలా అదృష్ట వంతురాలు. కానీ తనకి అలాంటి అదృష్టం వద్దని ఎన్నిసార్లు అనుకుందో ఎవరికీ తెలీదు. ఆ రోజు తను జన్మలో మరిచిపోలేని రోజు. తన ఆరవ పుట్టినరోజు. తన తోటి పిల్లలంద రినీ పార్టీకి పిలిచింది. అందరూ ఎదురుచూస్తు న్నారు. "అమ్మా! నాన్నరారేం? కేకు కోసి మా ఫ్రెండ్స్‌కి పెట్టాలి. త్వరగా రమ్మని ఫోను చెయ్యమ్మా".

"నాన్నకి అర్జెంటు మీటింగు ఉందిట్రా నేనున్నాగా పద..." అంటున్న అమ్మచెయ్యి పట్టుకొని నాన్న లేరన్న దిగులు మనసులో ఉన్నా కేకు కోసే ఉత్సాహంలో ఆ బాధ మర్చి పోయాను. కానీ ఆ ఉత్సాహం కూడా నిప్పుల మీద నీళ్ళు పోసినట్లుగా ఎగిరిపోయింది. అమ్మకి ఫోన్ వచ్చింది. హడావిడిగా బ్యాగ్ తీసుకొని, కనీసం నాకేమీ చెప్పకుండా కారు తీసుకొని వెళ్ళిపోయింది. వెళ్తూ వెళ్తూ "తాయా రూ! పాప చేత కేక్ కోయించి పిల్లలందరినీ జాగ్రత్తగా వాళ్ల యిళ్లకి పంపించు. నేను అర్జంటుగా మీటింగ్‌కి అటెండ్ అవ్వాలి.

కళ్లనించి వరదలా కారే కన్నీళ్లు తుడిచి, నాచేత తాయారు కేక్ కోయించడం, అన్నీ అయిపోయాయి. పిల్లలు పాడిన హ్యాపీ బర్త్‌డే పాట నాకు బ్యాడ్ బర్త్‌డేగా వినిపిం చింది. ఆ చిన్న మనసులో రేగిన బాధ ఎలా పైకి చెప్పాలో, ఎవరితో చెప్పుకోవాలో తెలియని వయసు. తాయారు బతిమాలినా ఏమీ తినకుండా వెక్కివెక్కి ఏడుస్తూ సోఫాలోనే పడి నిద్రపోయాను.

వాళ్లమటుకు వాళ్లకి తమ కూతురిని అత్యంత ప్రేమతో పెంచుకుంటున్నా మనుకు న్నారేమో. కావలసినదల్లా చేతిలో పెడితే నేను గొప్పగా జీవిస్తానని వాళ్ళ ఉద్దేశ్యం కాబోలు. కానీ నాకు అమ్మ ఆప్యాయత, నాన్న ప్రేమ తప్ప ఏమీ అక్కరలేదని వాళ్లకు తెలీదు. అమ్మ చేతి గోరుముద్దలు తింటూ నాన్న చెప్పే కబుర్లు వింటూ నాన్న ఒడిలో నిద్రపోవాలనే నా బుర్ర లోని చిన్ని ఆశ కలగానే మిగిలిపోయింది. నాన్నకి డబ్బు సంపాదనే ఆలోచన. నేను నిద్ర లేవకుండానే వెళ్లిపోయి, నిద్రపోయాక ఇంటికి చేరేవారు. అమ్మ సరేసరి... ఎప్పుడూ క్యాంపు లే. నా బాల్యం అంతా తాయారు ఒడిలోనే గడిచింది. క్రితం జన్మలో తాయారే నాకు తల్ల యి ఉంటుందనిపించేది. అప్పటికి తాయారుకి పదహారేళ్లకన్నా ఉండదు. 'నా'అన్నవాళ్ళు లేక పెరిగింది తాయారు. 'నా'అన్నవాళ్ళు ఉండీ లేనిదాన్లా పెరిగినదాన్ని నేను. మా యిద్దరినీ ఒక దగ్గర చేర్చినందుకు నాకు జ్ఞానం తెలిసాక దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకోకుండా ఉండలేక పోయాను.


అన్యమనస్కంగా యాంత్రికంగానే నా చదు

యమ్. విజయకుమారి

వు సాగింది. బొటాబొటీ మార్కులతో టెన్త్ పాసయ్యాను. ఇంటర్‌లో ఏ గ్రూప్ తీసుకోవాలో నిర్ణయించుకొనే లోపుగా అమ్మానాన్నా బై.పి.సి.లో చేర్పించేసారు. "బాగా చదువుకో, మెడిసిన్ చెప్పిస్తాను" కాలేజీకి వెళ్తున్న మొదటి రోజు అమ్మ అన్న మాట. అంతే... ఆ తర్వాత నేను ఎలా చదువుతున్నానో, ఎలా తింటున్నానో చూసే టైము, ఓపిక అమ్మకికానీ, నాన్నకికానీ ఏకోశానా లేదు. క్లాస్‌మేట్స్ పిలిస్తే ఒకటిరెండు సార్లు చదువుకుందికి వెళ్లి, అక్కడే పడుకుని ఉదయాన్నే ఇంటికి వచ్చేదాన్ని. వాళ్ల అమ్మలు వాళ్లని బుజ్జగించి, తినిపించి నిద్రతో ఓగుతున్న పిల్లలకి మొఖంకడిగి, వేడిపాలు తాగిస్తూ, దగ్గరుండి చదివిస్తూ ఉంటే జీవితంలో నేను ఎంత కోల్పోయానో గ్రహించి, వెల్లువలా వచ్చే దుఖాన్ని ఆపుకుందికి ప్రయత్నంచేసిన రాత్రులు ఎన్నో గుర్తుకు వచ్చేవి. పాస్ మార్కులతో ఇంటర్ పాసయానని‌పించేను.

"హుఁ! దేనికైనా రాసిఉండాలి. నిక్షేపంగా చదువుకుంటే మెడిసిన్ చెప్పిద్దామనుకున్నా. ఏం లాభం?"

మార్కులు చూసి అమ్మ అన్న మాటలు నా మనసులో ఈటెల్లా నాటుకున్నాయి. "ఎన్ని ఉన్నా ఏం లాభమమ్మా! నాకు కావలసిన పిడికెడంత అమ్మ ఆప్యాయత, నాన్న అనురాగం లేకపోయాక?" మౌనంగా రోదించింది నా మనసు. స్నేహితుల సలహాతో బి.యస్‌సి.లో జాయిన్ అయ్యాను. మళ్ళీ మామూలే. సాదా సీదాగా రోజులు గడిచి పోతున్నాయి. బియిడి




కథానిలయం 11వ వార్షికోత్సవ సభలో ప్రసంగిస్తున్న రచయిత శ్రీ ఆనందరావ్‌పట్నాయక్. వీరి కథాసంపుటి "గురుదక్షిణ"ని కారా మాష్టారు ఆవిష్కరించారు. ప్రొఫెసర్ కవనశర్మ, డా॥ మానేపల్లి సత్యనారాయణ, డా॥ కాళీపట్నం రామారావు చిత్రంలో ఉన్నారు.

చేసి ఒక టీచరుగా హైస్కూల్లో జీవితం మొదలు పెట్టాను.

నాన్నగారి కంపెనీ విపరీతంగా పెరిగి హైదరాబాద్‌లో హెడ్‌ఆఫీసు పెట్టి నాన్నని ఇన్‌ఛార్జ్‌గా ప్రమోట్ చెయ్యడంతో అమ్మ కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని ఇద్దరూ హైదరాబాద్‌లో మకాం పెట్టారు. వెళ్తూ వెళ్తూ "నీ జీవితానికి ఒక మార్గం చూపిస్తే మా బాధ్యత తీరిపోతుంది. నెట్‌లో చూసుకుని ఎవరు నచ్చారో చెప్తే మూడుముళ్ళూ వేయించేస్తాము. మేము అనుకున్నది ఏది జరిగింది కనుక?"

ఒక తల్లి కూతురితో ఇలాగే మాట్లాడుతుందా? నా భర్తని నేనే... అందులోనూ నెట్‌లో వెదుక్కోవాలా? అమ్మ, నాన్న ఇక్కడ ఉన్నా, హైదరాబాద్‌లోనో అమెరికాలోనో ఉన్నా నాకు ఒకటే. మా మధ్య దూరం అగాధంలా పెరిగిపోయింది. నా కోసం ఉదారంగా తల్లిలాంటి తాయారుని మాత్రం నాకు మిగిల్చి, నన్ను కన్నవారు నాకు దూరం అయ్యారు.

పెళ్లి విషయంలో నా నుంచి ఎలాంటి స్పందనా కనిపించకపోవడంతో వాళ్లే నెట్‌లో పెళ్ళికొడుకుని చూసి, ఫిక్స్‌చేసి నాకు శుభలేఖ పంపారు. నా నిర్ణయంతో కాని, నా యిష్టాలతో కానీ వాళ్లకి పనిలేదు. పెళ్లికొడుకు అమెరికాలో ఎంబియ్యే చేసి, అక్కడే సెటిల్‌అయ్యాడు. హౌస్ వైఫ్ అయితే చాలట. అతని గురించి ఇంతవరకే తెలుసుకొని, ఉద్యోగం మానేస్తుందని నా తరపున వాళ్లే హామీయిచ్చి పెళ్లి సెటిల్ చేశారు.

వారంరోజులు హడావిడి. కలలో గడిచినట్లు గడిచిపోయింది. కృష్ణమూర్తి... అదే మా వారు వెళ్తూ వెళ్తూ నన్ను పాస్‌పోర్ట్‌కి అప్లయి చేసి త్వరలో తనదగ్గరకి వచ్చే ప్రయత్నం చెయ్యమని చెప్పి, అమెరికాకి ఎగిరిపోయాడు. కొత్తగా పెళ్లయిన వారిమధ్య ఉండాల్సిన అనురాగ బంధం నాకు కృష్ణమూర్తితో ఏర్పడలేదు. తనేమిటో అర్థంచేసుకొనే లోపునే నాకు దూరంగా వెళ్లిపోయాడు.

వెళ్లేక ఫోన్ చేస్తారేమోనని ఆశగా ఎదురు చూసేదాన్ని. నెల, రెండునెలలు గడిచినా అటు నుంచి ఉత్తరంగానీ, ఫోన్‌గానీ లేదు. మెయిల్ అడ్రస్ అయినా ఇవ్వలేదు. అతను అడిగిన మూడు లక్షలూ కట్నంగా తీసుకున్నాడని తర్వాత అమ్మ చెప్పింది. నాకెందుకో ఉద్యోగానికి రిజైన్ చేయాలనిపించలేదు. పాస్‌పోర్ట్‌కి అప్లయిచేస్తే మూడునెలల్లో వచ్చింది.

హఠాత్తుగా ఒకరోజు కృష్ణ అమెరికా నుండి దిగేడు. అఫీషియల్ ట్రిప్ అని చెప్పి రెండే రోజులుండి వెళ్లిపోయాడు. ఎంతో బ్రతిమాలిన మీదట ఫోన్ నెంబరు, మెయిల్ అడ్రస్ యిచ్చేడు. ఎప్పుడు వస్తావని కానీ, తనువచ్చి తీసికెళ్తానని గానీ అనలేదు. ఒక్కమాట తను అనిఉంటే ఉద్యోగం వదిలేసి వెళ్లిపోదానుకున్నా. ఆ అవకాశం కృష్ణ నాకు ఇవ్వలేదు.

కృష్ణ వెళ్లిపోయాక రెండునెలలకి నేను గర్భవతినని డాక్టర్ చెప్పగానే ఏదో కొత్త ఉత్సాహం నాలో కలిగింది. కృష్ణ మెయిల్ ఎడ్రస్‌కి మెయిల్ ఇచ్చాను. వెంటనే కంగ్రాట్స్ చెప్తూ జాగ్రత్తలు చెప్పేడు. కానీ ఆ ఉత్సాహం ఇంకో నెలకి నీరు కారిపోయింది. ఒకరోజు స్కూల్లో కళ్లుతిరిగి పడిపోతే కొలీగ్స్ హాస్పిటల్‌లో చేర్పించేరు.

డాక్టర్ నావైపు జాలిగా చూస్తూ అబార్షన్ అయిందన్న చేదువిషాన్ని మందుతో పాటు నా గొంతులో పోసింది. పదిహేను రోజుల విశ్రాంతి తర్వాత మళ్లీ రొటీన్‌లో పడిపోయాను.

విషయం తెలిసి కృష్ణ నిట్టూర్పు విడిచాడు. మళ్లీ నాలుగు నెలలు గడిచి పోయాయి.

గాలి దుమారంలా మళ్లీ వచ్చి, నాలుగు రోజులుండి వెళ్లాడు కృష్ణ. భార్యాభర్తల మధ్య ఇంతకన్నా ఇంకేం లేదా? నా జీవితం నాకే వింతగా అనిపించింది. రమ్మని తనూ అన లేదు. వస్తానని నేనూ అనలేకపోయాను. అటు నుంచి ఎంతదూరమో ఇట్నుంచి అంతేకదా! మళ్లీ రెండునెలలకి ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ కావడం, మూడవ నెలలో అబార్షన్. ఏదో రొటీన్‌గా జరిగినట్లు అన్నీ మామూలుగా జరిగిపోయా యి. నాలో ఏమీ డిఫెక్ట్ లేదన్నారు డాక్టర్లు. అంటే లోపం కృష్ణలోనే ఉందన్నమాట. దూర మైన కన్నవారి ప్రేమ, కరువైన కట్టుకున్న వాడి ప్రేమ, ఒంటరితనం ఇవన్నీ మానసికంగా ఏదో మూలగాఉండి అబార్షన్‌కి కారణాలుగా కనిపిస్తున్నాయి. విషయం తెలిసిన కృష్ణ సమా ధానం – "దీనికింత విచారం దేనికి సావిత్రీ... టేకిట్ ఈజీ. నీకంతగా పిల్లలు కావాలను కుంటే టెస్ట్‌ట్యూబ్ బేబీలకి కొదువలేదు. వెబ్ సైట్ ఎడ్రస్ ఇస్తాను వాళ్లని కాంటాక్ట్ చేస్తే డిటైల్స్ చెప్తారు. నేను కూడా వాళ్లని కాంటాక్ట్ చేసి నీకు సంతానం కలిగేలా చూస్తా. డోంట్ వర్రీ... బై..."

ఒక భర్త భార్యకి ఇచ్చే ఓదార్పు ఇదేనా? ఇంతేనా? అంతరాత్మ అడిగిన ప్రశ్నకు నవ్వా లో ఏడవాలో తెలీలేదు. నా ప్రమేయం లేకుం డానే ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ కోసం డైరెక్ట్ గా డాక్టర్లు ఇంటికి వచ్చి, కృష్ణ తమని కాంటాక్ట్ చేసి విషయం అంతా చెప్పేడని దానికోసం అయ్యే ఖర్చంతా ముందుగానే పే చేశాడని చెప్పేరు. నేనొక మరబొమ్మలా వాళ్ళు చెప్పిన దానికి తలఊపి, యాంత్రికంగా ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ద్వారా తల్లినయ్యాను. తాయారు సహాయంతో బాబుని చూసుకుంటూ జీవితం గడిపేస్తున్నాను. నరేంద్రుడంత గొప్పవాడు కావాలని బాబుకి నరేన్ అని పేరు పెట్టేను. బాబుకి మూడేళ్లు వచ్చాయి. నేను పెట్టుకున్న రిక్షా అబ్బులుతో తాయారుకి పెళ్లి చేసి, ఇద్దరినీ నా రెండు కళ్లలా చూసుకుని వాళ్లనే నా జీవితానికి ఆలంబనగా చేసుకొన్నాను.

వేసవి సెలవులు రెండునెలలు దొరకగానే టికెట్‌బుక్ చేసుకొని ధైర్యంగా ఫ్లయిట్ ఎక్కే శాను. చదువుకున్నదాన్నే కనుక ఎడ్రస్ కరక్ట్‌గా పట్టుకొని కాలింగ్‌బెల్ కొట్టాను.

"హూఆర్‌యూ? తలుపు తీస్తూ ప్రశ్నించిం ది ఒక విదేశీ వనిత.

"అయాం కమింగ్ ఫ్రమ్ ఇండియా. ఈజ్ దిస్ మిస్టర్ కృష్ణాస్ హౌస్?" నా గుండె చప్పుడు నాకే వినిపిస్తోంది. "ఎస్. ప్లీజ్ కమిన్! ఎంతో గౌరవంగా లోనికి ఆహ్వానించిందావిడ. కృష్ణ గురించి అడిగితే సాయంత్రం వస్తారని చెప్పింది. ఆ యింట్లో ఆవిడ స్థానం ఏమిటో నాకు సాయంత్రానికి గానీ తెలీలేదు. తెలిశాక ఒక్కసారిగా అగాధాల్లోకి పడిపోయిన ఫీలింగ్. పైకి లేచే అవకాశం ఏకోశానా కనిపించడం లేదు. కృష్ణ సాయంత్రం వచ్చి నన్ను చూసి షాకయ్యాడు. పిల్లాడ్ని చూసి, నన్ను మభ్యపెట్ట డానికి ఏదో ఏదో మాట్లాడేడు.

సాయంత్రానికి ఆ యువతి చెప్పిన విష యాలు... ఆమె పేరు స్టెల్లా, ఆరునెలల క్రితం మేరేజ్ చేసుకున్నాడు.

ఆమెతో నేను కృష్ణ ఇండియా భార్యనని చెప్పడానికి మనస్కరించలేదు. కృష్ణ వచ్చే లోపు నే మర్నాటికి టికెట్ తీసుకొని ఇండియాకి బయల్దేరాను. ఇంకో గంటకి ఫ్లయిట్ బయలు దేరుతుందనగా ఆఫీస్ నుంచి డైరెక్ట్‌గా ఎయిర్ పోర్టుకి వచ్చేడు కృష్ణ. ఏమాత్రం అభిమానం,

ఆప్యాయత కనిపించని కంఠంతో "నాకు ఇండియా రావడం కుదరదు. నీ కిష్టమైతే స్టెల్లాతో కూడా కలిసి ఉండాలనుకుంటే రావచ్చు. లేకపోతే మీ నాన్న ఇచ్చిన మూడులక్షలూ నీకు పంపించేస్తాను. బాబు పోషణకి కావాలంటే డబ్బు పంపుతాను". మూడులక్షలతో మూడు ముళ్లబంధం తెంపేశాడు కృష్ణ. కనీసం అతనికి సమాధానం చెప్పాలని కూడా అనిపించలేదు. ఎటో చూస్తూ విననట్లుగా ఉండిపోయాను. అదే నా వైవాహిక జీవితంలో ఆఖరి రోజు. బాబుతో ఇండియాకి వచ్చేశాను. ఐదేళ్ళు వచ్చాక బాబుని సైనిక్ స్కూల్లో చేర్పించాను. తాయారుకి చదువు చెప్తూ ఇంటర్ పరీక్షలు రాయించేను. ఇంటివెనక స్థలంలో రెండు గదులు వేసి అబ్బులు, తాయారులకు ఇచ్చేను. నాకు తల్లీ, తండ్రీ, దైవం అన్నీవాళ్లే. ఏ కాస్త అనారోగ్యం చేసినా నా గురించి స్వంత వాళ్ల కన్నా ఎక్కువగా జాగ్రత్తలు తీసుకొనేవారు. పన్నెండేళ్లు గడిచిపోయాయి. బాబు ఇంటర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. వస్తూనే వాడు అడిగిన ప్రశ్నకి నేను స్థాణువునై, వెర్రిదానిలా వాడి ముఖంలోకి చూస్తూ ఉండిపోయాను.

ఇన్నాళ్ల నుంచీ నాన్న ఏరని అడిగితే అమెరికాలో ఉన్నారని చెప్పి నన్ను మభ్యపెట్టేవు. ఇన్నేళ్ల తర్వాత నువ్వు చేసిన మోసం ఈ రోజు బయటపడింది. అమెరికాలో ఉన్న కృష్ణగారు నాకు నాన్న కాదటకదా! నేను టెస్ట్‌ట్యూబ్ ద్వారా పుట్టిన వాణ్ణని తెలిసి ఆత్మహత్య చేసుకుందామనుకున్నా. కానీ నీ మోసం నాకు తెలిసిందని చెప్పి, ఆఖరుసారిగా నీ జ్ఞాపకాలని నీ దగ్గర వదిలి వెళ్దామని వచ్చేను".

నేను, కృష్ణా తీయించుకున్న పెళ్లి ఫొటో తీసి నేలకి విసిరికొట్టేడు. "ఈ రోజుతో నీకు కొడుకు లేడనుకో. నాకోసం నువ్వు ఎక్కడా వెతికించకు. గుడ్‌బై...". జరిగిందేమిటో, జరుగుతున్నదేమిటో తెలుసుకొనే లోపుగానే నరేంద్ర వచ్చిన ఆటోలోనే వెళ్లిపోయాడు. కుప్పలా కూలబడిపోయాను. కృష్ణ విడాకులు తీసుకుంటానన్నా నరేంద్ర భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకొని తిరస్కరించేను. అనుమానం రాకుండా కృష్ణని నరేన్‌కి అప్పుడప్పుడూ ఉత్తరాలు రాస్తూండమని మెసేజ్ ఇచ్చేను. అయినా వీడికి ఈ విషయం ఎవరు చెప్పిఉంటారు? ఉన్న ఫళాన నరేన్ పుట్టుకకు కారణమైన ఆస్పత్రికి వెళ్లి జగన్‌ని కలిశాను.

"డాక్టర్! పదహారేళ్ళ క్రితం మీరు ఆర్టిఫిషియల్ ఇన్‌సెమినేషన్ ద్వారా నాకు సంతానం కలిగేలా చేశారు. గుర్తుకొచ్చానా?" దూకుడుగా తనను తాను కంట్రోల్ చేసుకుంటూ అడిగింది సావిత్రి.

"ఓహ్! సావిత్రిగారు కదూ! గుర్తులేకేం? చాలాకాలం అయింది. ఏమిటి విశేషం... ఇలా వచ్చేరు? అవును మీ నరేన్ సైనిక్ స్కూల్లో చదువుతున్నాడు కదూ! మా వినయ్ కూడా అక్కడే చదువుతున్నాడు. ఇద్దరూ బెస్ట్‌ఫ్రెండ్స్ కూడా...!"

ఇంకా ఏదో చెప్తున్న డాక్టర్ మాట వినకుండా లేచి కన్నీళ్లు ఆపుకుంటూ బైటకు వచ్చేను. నరేన్‌కి విషయం ఎలా తెలిసిందో ఊహించలేనంత తెలివితక్కువదాన్ని కాదు. నా జీవితంలో తల్లిపాత్ర అంతటితో ప్రక్కకు తప్పుకుంది. అసలు నేను ఎందుకు, ఎలా, ఎవరి కోసం బ్రతకాలో అర్థంకాని అయోమయంలో జీవితం గడిపేను. ఒక భార్యగా భర్తకు పనికి రాలేదు. ఒక కొడుకుకి మాతృమూర్తిగా నిలవలేకపోయాను. ఇంక ఒక టీచరుగా విద్యార్థులకు మాత్రం నేను తగినదానినేనా అన్పిం

చింది. ఉద్యోగం నుంచి వాలంటరీ రిటైర్ మెంట్ తీసుకున్నా. పుస్తకాలు చదవడం, టి.వి. చూడటం తప్ప ఇంట్లో పనేముంది? మందులకు లొంగని మానసిక వ్యధ నన్ను చుట్టుముట్టింది. శుష్కించిన శరీరం అబ్బులు, తాయారు తల్లిదండ్రుల కన్నా ఎక్కువగా లాలించి తినిపించే రెండు ముద్దలతో ఎన్నాళ్లుంటుంది?

* * *

మంచం మీద కూర్చుని హార్లిక్స్ తాగుతూ ఉండగానే... అబ్బా! అంటూ గుండెచేత్తో పట్టుకుంది సావిత్రి. గ్లాసు క్రింద పడిన శబ్దానికి తాయారు పరుగెత్తుకుంటూ వచ్చింది. అప్పటికే మెలికలు తిరిగిపోతూ ఉంది సావిత్రి. రాత్రి 9 గం॥ అయింది. అబ్బులు కూడా అప్పుడే రిక్షాని షెడ్‌లో పెట్టి, లోపలికి వస్తున్నాడు. విషయం తెలిసి వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేశాడు. ఐదునిమిషాల్లో డాక్టర్ వచ్చి ఇంజక్షన్ చేశాడు. ఇలాంటి పెయిన్ మళ్లీ వస్తే ప్రాణానికి ప్రమాదం అని సూచనలిచ్చి వెళ్లేడు. తాయారు మనసు విలవిలలాడింది. మర్నాడు సావిత్రి లాయర్‌ని పిలిపించి, తనపేరుమీద ఉన్న ఇల్లు, బ్యాంకులో డబ్బు అంతా తాయారు పేరున రాయించింది. తాయారు వద్దని కాళ్లావేళ్లా పడింది. "చూడు తాయారు! నన్ను అమ్మగా లాలించేవు. కూతురుగా సేవలు చేసేవు. నీకన్నా నాకెవరున్నారు? నానిర్ణయానికి తిరుగులేదు" స్థిరంగా ఉంది సావిత్రి కంఠం.

మళ్లీ పదిరోజులకి విపరీతమైన గుండెనొప్పి రావడం, డాక్టర్ వచ్చేలోపునే సావిత్రి పైలోకాలకు ఎగిరిపోవడం జరిగిపోయాయి. ఇవ్వక తప్పదన్నట్లు తాయారు కృష్ణకి మెసేజ్ ఇచ్చింది. తను పోయాక అబ్బులు తనకు తలకొరివి పెట్టాలని వీలునామాలో సూచించడంతో మర్నాడు పదిగంటలకు యధావిధి కార్యక్రమం నిర్వర్తించి, మరబొమ్మలా సావిత్రి భౌతికకాయాన్ని శ్మశానానికి మోసుకుపోయారు తాయారు, అబ్బులు. శ్మశానంలో వీడియో తీయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. తాయారుకి ఆశ్చర్యం వేసింది. శ్మశానం ఇళ్ళ మధ్య ఉండడంతో వీడియోవైరు ప్రక్కనే ఉన్న ఇంటి వరకూ కనిపించింది. "ఎవరుబాబూ! ఏమిటిదంతా?" పాడెని క్రిందికి దించుతూ అబ్బులు అక్కడున్న ఇద్దరు యువకులను అడిగేడు. "అమెరికాలో ఉన్న కృష్ణ స్నేహితులం మేము. రెండు రోజుల క్రితం ఇండియాకి వచ్చాం. నిన్న రాత్రి కృష్ణ మాతో మాట్లాడి, తన వైఫ్ పోయిందని, వీడియో తీసి, కంప్యూటర్‌కి కనెక్ట్ చేస్తే నెట్‌లో కార్యక్రమం అంతా చూస్తానని అన్నాడు. అందుకని ఈ ఎరేంజ్ మెంట్ చేస్తున్నాం". కెమేరా సవరించుకుంటూ గొప్ప కార్యం చేస్తున్నట్లు ఫోజుకొట్టాడా అమెరికన్ రిటర్న్‌డ్.

వైరుతోబాటు కెమేరాని ఒక్క విసురుతో లాగి, క్రిందకి గిరాటేసింది తాయారు. "ఏమిటి బాబూ! కృష్ణగారికి ఇండియాలో వైఫ్ ఉన్నట్లు గుర్తుకొచ్చిందా? లేక ఆవిడపోయాక ఆస్తి ఎక్కడకూ పోకుండా రాబందుల్లాపడి దోచుకుందుకా ఈ నాటకం? బంగారుతల్లి ఇప్పటి వరకూ పడిన బాధలు తీరి, పైలోకాలకు చేరుతోంది బాబూ! ఆమె ఆత్మని కూడా నెట్‌లో బంధించి క్షోభ పెట్టకండి. అరవై ఏళ్లకే ఆరు జన్మల అనుభవం పొందిందా తల్లి. పొండి బాబూ! పొండి... ఆమెని తృప్తిగా పంపించనీయండి" రెండు చేతులూ ఎత్తి వాళ్లకి దండం పెట్టి ఏకధారగా కురుస్తున్న కన్నీళ్లను ఆపుకుందుకి ప్రయత్నం చేస్తున్న తాయారుని సావిత్రి ఆత్మ ఆప్యాయంగా తడిమింది. ●